క్లుప్తంగా

పెన్నాలో ఇసుక రీచ్‌ల ఏర్పాటు

సిద్దవటం : ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసేందుకు సిద్దవటం పరిధిలోని పెన్నానదిని శుక్రవారం పరిశీలించామని కడప మైనింగ్ శాఖ ఆర్‌ఐ కవిత తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సిద్దవటం మండలంలోని జంగాపల్లె, ఎస్. రాజంపేట గ్రామాల సమీపంలో ఉన్న పెన్నానది పరివాహక ప్రాంత్రాల్లో నూతనంగా ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసేందుకు అనుమతులు తీసుకొని హద్దులు ఏర్పాటుకు పరిశీలించామన్నారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం ఫారెస్టు రేంజర్ ప్రసాద్, ఇరిగేషన్ ఏఈ నారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

సిద్దవటం : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించామని కడప భారతీ అస్పత్రికి చెందిన పీఆర్‌ఓ కిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ భారతీ అసుపత్రి కడప వారి ఆధ్వర్యంలో 25 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. వీరిలో 5 మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశామని తెలిపారు. వీరికి శుక్రవారం రాత్రి కడపలోని భారతీ అస్పత్రిలో డాక్టర్ స్వరూపారాణి కంటి ఆపరేషన్‌లు నిర్వహించనున్నట్లు ఆయన అన్నారు. ఆప్తోమెట్రిస్టు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జేవీవీలో సభ్యత్వం తీసుకోవాలి

జేవీవీ జిల్లా అధ్యక్షుడు రౌఫ్‌బాషా



క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న జన విజ్ఞాన వేదిక నాయకులు తదితరులు

నందలూరు(రాజంపేట) : జన విజ్ఞాన వేదికలో ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలని జేవీవీ జిల్లా అధ్యక్షుడు రౌఫ్‌బాషా పిలుపునిచ్చారు. నందలూరు నీలిపల్లెలోని మినీ యుటీఎఫ్ కార్యాలయంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పేరుకుపోయిన మూఢ నమ్మకాలు పారద్రోలి ప్రజల్లో సైన్స్‌పట్ల అవగాహన కల్పిస్తామన్నారు. ప్రజలలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పర్యావరణం, విద్య, వైద్యం ఆరోగ్యం, సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యుటీఎఫ్ నేతలు చంద్రఓబులరెడ్డి, రమేష్, జేవీవీ నేతలు శామ్యూల్, కృపానందం, ప్రేమ్, సుబ్బరాయుడు, సుధాకర్, ఇమామ్ బాషా, ఐజయ్య, విజయకుమార్, హరినాథ్, చిన్నరెడ్డన్న, ఆనంద్ కార్యకర్తలు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించండి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ చక్రే నాయక్

లక్కిరెడ్డిపల్లె : విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించి మంచి అలవాట్లు నేర్పించాలని ఎంఈఓ చక్రే నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం వడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల హాజరు ఆన్‌లైన్‌లో తప్పక వేయాలన్నారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలన్నారు.

రోడ్డు ప్రమాదం; నలుగురికి తీవ్ర గాయాలు

మదనపల్లె: రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు తీవ్రంగా గాయపడిన సంఘటన చౌడేపల్లె మండలంలో శుక్రవారం జరిగింది. పుంగనూరు మండలం కుదవూరుకు చెందిన వెంకటరమణ(33) భార్య తేజ (25), కుమారులు భగత్(5), హర్ష (4)లతో కలిసి ద్విచక్రవాహనంలో చౌడేపల్లె మండలంలోని పెద్దూరులో పండుగకు బంధువుల ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యంలో ట్రాక్టర్ వీరిని ఢీకొంది. గాయపడిన వారిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను అమలుపరచండి

రాయచోటి అర్బన్ : ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని అమలుపరచాలని జిల్లా సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం డీహెచ్‌పీఎస్ నేత సుధీర్, గిరిజన హక్కుల పోరాట సమితి నేత విశ్వనాథ నాయక్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్ది గాళ్ళ శ్రీనివాసులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం అమలు కాలపరిమితి 2023 జనవరి 23తో ముగుస్తుందన్నారు. కాగా చట్టం అమలులో పాలకులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారంటూ ఆరోపించారు.

22న రౌండ్‌టేబుల్ సమావేశం

ఈనెల 22న స్థానిక ఎన్జీఓ సభా భవనంలో ఎస్సీ, ఎస్టీ చట్టం అమలుపై రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, మేధావులు పాల్గొనాలని కోరారు.

అర్హులకు పథకాలు.. సమస్యలకు పరిష్కారాలు

- వైఎస్సార్ విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం భవనాలు ప్రారంభం
- గరుగుపల్లె గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



పింఛన్ విషయమై వృద్ధురాలితో వాకబు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : కులం, మతం, ప్రాంతం, పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గరుగుపల్లె గ్రామంలోని గరుగుపల్లె, హరిజనవాడ, టమటంవారిపల్లె, వడ్డిపల్లె, సావటిగడ్డపల్లె, గొల్లవాండ్లపల్లెలలో గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని లబ్ధిదారులను అడిగి ఎమ్మెల్యే తెలుసుకున్నారు. అన్ని వర్గాలకు అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించి వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. మూడేళ్లల్లో అందజేసిన పథకాల లబ్ధికి సంబంధించిన బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందించారు. ప్రజల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం స్వర్ణయుగంగా సీఎం జగన్ పరిపాలిస్తున్నారని, ఇందుకు తిరిగి ఆయన్ను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని సూచించారు.

గరుగుపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పండుగ వాతావరణం మధ్య ఆత్మీయ స్వాగతాలతో ప్రజలు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డికి నీరాజనాలు పట్టారు.

విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు

విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. గరుగుపల్లె గ్రామంలో విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్ర నూతన భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించి అక్కడ వైద్య సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు.

సమస్యల పరిష్కారానికి..

టమటంవారిపల్లిలో 11కేవీ సప్లైలైన్ పునరుద్ధరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే కోరారు. గరుగుపల్లె కస్పాకు చెందిన బయ్యమ్మకు ఫించన్ మంజూరు చేయాలని కోరగా, సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదభూషన్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆవుల నాగభూషణ్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు ఖాదర్ మొహిద్దీన్, సర్పంచ్‌లు ఉమాపతి రెడ్డి, చెన్నకేశవరెడ్డి, చింతంరెడ్డి జానకమ్మ, ఉమా ప్రభాకర్, విలేజ్ క్లినిక్ స్థలదాత పెండ్లిమర్రి ప్రేమానందం, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్ విలేజ్ క్లినిక్, ఆర్బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

కలెక్టర్ దృష్టికి నందలూరు ప్రజాసమస్యలు

నందలూరు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి



కలెక్టరును కలిసిన సమస్యలు వివరిస్తున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి తదితరులు

నందలూరు(రాజంపేట) : మండలంలోని ప్రజాసమస్యలను కలెక్టర్ గిరీషా పీఎస్ దృష్టికి తీసుకెళ్లామని మండలాధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరును ఆయన చాంబరులో కలిసి మండలంలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపాలని కోరామన్నారు. ప్రధానంగా నందలూరు జెడ్పీ హైస్కూల్ షిఫ్ట్ విధానంలో కొనసాగడంతో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇంటర్మీడియట్‌కు సొంత భవన నిర్మాణ స్థల సమస్య అలాగే ఉండిపోయిందన్నారు. నందలూరు గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం భవనాలు సరిపోవడం లేదని, 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేసేందుకు గతంలో వైఎస్సార్ జిల్లా కలెక్టర్‌కు ప్రభుత్వం స్థలాన్ని ఎంపిక చేశారన్నారు. కొత్త జిల్లాలో ఆ ప్రతిపాదన ఆటకెక్కిందన్నారు. ఇప్పుడు ఆ స్థలం వైద్య విధానపరిషత్‌కు అప్పగిస్తే 30 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కృషి చేస్తారన్నారు. నందలూరు కన్యకల చెరువుపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులు చేపల విక్రయానికి తాత్కలిక నిర్మాణాల విషయంలో సానుకూలంగా స్పందించాలని ఆయన్ను కోరినట్లు పేర్కొన్నారు. మత్స్యకారులకు ఫిష్ మార్కెట్ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి స్థలం కేటాయించాలని తెలియజేశామన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ తమీమ్, సబ్ కలెక్టర్ అహ్మద్‌ఖాన్‌లను కలిశారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యుడు కలీం, వైఎస్సార్‌సీపీ నాయకులు నడివీధి సుధాకర్, అరిగెల నాని, ముమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, మత్స్యకారుల సంఘం పెద్దలు పెద్దబోయ వెంకటసుబ్బయ్య, బాబు, చిన్న, రమణ, సుధ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



రాయచోటి అర్బన్: చేపల విక్రయదారులతో మాట్లాడుతున్న అధికారులు

రాయచోటి అర్బన్ : మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న రుణాన్ని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రాంబాబు, ఆర్‌ఐ మల్లికార్జున, మత్స్యశాఖ మార్కెటింగ్ ఏడీ రెడ్డెయ్య, అసిస్టెంట్ రామమోహన్‌నాయక్‌లు సంయుక్తంగా పట్టణంలోని చేపల విక్రయ దుకాణాలను పరిశీలించారు. పరిశుభ్రమైన వాతావరణంలోనే చేపలను అమ్మాలని విక్రయదారులకు వారు సూచించారు. తూకం వేసే పరికరాలు, చేపల నిల్వ చేసే బాక్స్‌లు తదితరాలను ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందిస్తుందంటూ చెప్పారు. చేపల విక్రయదారు లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలంటూ కోరారు. కార్యక్రమంలో పలువురు విక్రయదారులు పాల్గొన్నారు.

చేపల విక్రయాలకు స్థల పరిశీలన

రాయచోటి టౌన్ : పట్టణంలో చేపల వ్యాపారులు విక్రయాలు చేసేందుకు స్థలాన్ని కలెక్టర్ ఆదేశాలతో పరిశీలిస్తున్నట్లు మత్స్యశాఖ ఏడీలు రెడ్డెయ్య, సుస్మితలు తెలిపారు. శుక్రవారం వారు రైతు బజార్‌కు దగ్గరగా ఉన్న స్థలాన్ని శుక్రవారం పరిశీలించామన్నారు. స్థలాన్ని గుర్తించిన అనంతరం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. వినియోగదారులకు నాణ్యమైన రుచికరమైన చేపలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. స్థల పరిశీలన అనంతరం అక్కడ అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. అలానే చేపల వ్యాపారులకు బ్యాంక్ రుణాలు కల్పించి వారిని ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామన్నారు.

రహదారి నియమాలపై అవగాహన



చిన్నమండెం: ఆటో డ్రైవర్లకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



రాయచోటి టౌన్: ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ అనిల్‌కుమార్

రాయచోటి టౌన్ : 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాలలో భాగంగా శుక్రవారం వాహనదారులకు అన్నమయ్య జిల్లా వాహనాల తనిఖీ అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిత్తూరు రోడ్డులో రాయచోటి ఎంవీఐ జె. అనిల్‌కుమార్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రోడ్డుపై వెళుతున్న వాహనదారులను ఆపి పలు సూచనలు చేశారు. హెల్మెట్, అధిక లోడ్, సీట్ బెల్ట్ వాడకంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్లకు, ఆటోలకు రిఫ్లెక్టివ్ (రేడియం స్టిక్కర్లు) అతికించుకోవాలని దాని ద్వారా ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. వేగం కన్నా ప్రాణాలు మిన్న విషయాన్ని డ్రైవర్లు గుర్తించాలన్నారు. వాహనాల తనిఖీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజంపేటలో...

రాజంపేట : వాహనదారులు నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేయాలని రాజంపేట ఎంవీఐ బి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం కడప– రేణిగుంట జాతీయ రహదారిలో వాహనాలకు దగ్గరుండి రేడియం స్టిక్కర్లను అతికించేలా చర్యల చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు వెనుక రేడియం స్టిక్కర్ ఉండటం వల్ల వెనుక వచ్చే వాహనదారుడు అప్రమత్తమవుతాడన్నారు. హైవేలో వేగంతో వెళుతున్నప్పుడు రేడియం స్టికర్ లేకుంటే ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉంటాయన్నారు. మోటారు చట్టం నిబంధనలు పాటించాలన్నారు. లైసెన్స్ తప్పనసరిగా ఉండాలన్నారు. అతివేగం ప్రమాదకరమనేది గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట ఎంవీఐ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. కాగా రేడియంస్టిక్కర్‌లేని వారి గుర్తించేందుకు తనిఖీ నిర్వహించారు.

డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు

చిన్నమండెం : రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం పలు వాహనాల డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలను ఆరోగ్య శాఖాధికారుల సాయంతో నిర్వహించినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. అదే విధంగా ఆటోడ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తూ ప్రయాణికులు, సమాజం, వృద్ధుల పట్ల బాధ్యతతో వ్యవహరించాలన్నారు. కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకొని వాహనాలు నడపాలన్నారు. వేగంగా వెళ్లకూడదని.. క్షేమంగా ఇల్లు చేరాలని సూచించారు.

జగనన్న పాల వెల్లువ గ్రామ సభ



పాడి రైతులతో మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం రెడ్డమ్మ

రామాపురం : జగనన్న పాల వెల్లువపై గ్రామ సభను చిట్లూరు గ్రామంలోని మజ్జిగవాండ్లపల్లిలో శుక్రవారం నిర్వహించినట్లు ఎంపీడీఓ హైదర్‌వలీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతులకు ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. జగనన్న పాల వెల్లువ పథకం ద్వారా పాడి రైతులకు మేలు చేకూరనుందని తెలిపారు. ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని ఆదాయం పొందాలన్నారు. ఎక్కడ పాడి పంటలు సమృద్ధిగా ఉంటాయో అక్కడే దేశం సుభిక్షంగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ రామాంజులు, వెటర్నరీ డాక్టర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, వెలుగు ఏపీఎం రెడ్డమ్మ, రూట్ ఆఫీసర్, సీసీలు, వెల్ఫేర్ అసిస్టెంట్, వీఓఏలు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

600 లీటర్ల సారా ఊట ధ్వంసం

పీలేరు రూరల్: సారా తయారీకి సిద్ధంగా ఉన్న 600 లీటర్లు ఊటను ధ్వంసం చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ వై.గురుప్రసాద్ తెలిపారు. శుక్రవారం అందిన సమాచారం మేరకు మండలంలోని జాండ్లపంచాయతీ ఆవులయ్యగారిపల్లె అటవీ ప్రాంతాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించినట్లు తెలిపారు.

23 నుంచి వన్నూర్‌సాహెబ్ ఉరుసు

మదనపల్లె సిటీ: స్థానిక వన్నూర్‌సాహెబ్‌గుట్టలో వెలసిన బాబా ఏసానుల్లా ఖాన్‌వారీ దర్గా ఉరుసు ఉత్సవాలు ఈనెల 23 నుంచి ప్రారంభంకానున్నట్లు ఖాన్‌వార్సీ ట్రస్టు చైర్మన్ బాబా నసీబుల్లాఖావార్సీ తెలిపారు. 23న గంధం, 24న ఉరుసు, 25 ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తామన్నారు.

వలంటీర్ పోస్ట్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

రామాపురం : మండలంలోని హసనాపురం, చిట్లూరు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్లకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ హైదర్‌వలీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిట్లూరు బీసీ జనరల్–1, హసనాపురం బీసీ జనరల్–1 ఉన్నాయని, ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు 21వ తేదీ 5గంటలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

చిట్వేలి : మండలంలో ఖాళీగా ఉన్న వలంటరీ పోస్టులకు లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి కోరారు. 10వ తరగతి, ఆపై విద్యార్హత ఉన్న నిరుద్యోగ యువతీయువకులు దరఖాస్తు చేసుకోవచ్చని శుక్రవారం ఎంపీడీఓ తెలియజేశారు. ఈనెల 27 నుంచి 29వ తేదీలలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

చిన్నమండెం : మండల పరిధిలోని కేశాపురం గ్రామంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుకు ఆసక్తి గల బీసీ జనరల్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ దివ్య ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు



సేంద్రియ ఎరువుల వాడకంపై శిక్షణ ఇస్తున్న అధికారులు

ఓబులవారిపల్లె : ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారి శ్రీరాములు పేర్కొన్నారు. శుక్రవారం బాలిరెడ్డిపల్లె గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు రైతులకు అవగాహన, శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక రైతు ఆంజనేయులు చీనీ మొక్కలకు వెయ్యికేజీల జీవామృతం తయారు చేయించి దానిని ఎలా వాడాలో రైతులకు సూచనలు చేశారు. ఉద్యానశాఖ అధికారిణి ఆషీయా మాట్లాడుతూ రసాయనిక ఎరువులు వినియోగం తగ్గించి గో మూత్రం, పేడతో ప్రకృతి వ్యవసాయం చేయాలని కోరారు. పురుగుల మందులు వాడకం తగ్గించి ప్రకృతి పరంగా పెరుగు, వేప తదితరాలను వాడటంతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చాన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షులు నందలూరు వెంకటసుబ్బారెడ్డి, మాస్టర్ ట్రయినర్, నరసింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శి బిందు, ఏడీఏ తిరుపాలమ్మ, ఎంసీఏ ఓబుళ్లయ్య, ఐసీఆర్‌పీ రత్నమ్మ తదితరులు రైతులు పాల్గొన్నారు.

అమ్మవారికి రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో భద్రకాళి అమ్మవారు



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రాయచోటి టౌన్ : భద్రకాళి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి, అనంతరం పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, నిమ్మకాయల హారాలతో అందంగా అలంకరించారు. భక్తులకు రాహుకాల పూజల విశిష్టతను ఆలయ ప్రధాన అర్చకులు తెలియజేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. పూజలు ఆలయ పాలకమండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డి, అర్చకులు కృష్ణయ్య, రాచరాయ యోగీ స్వామి ఆధ్వర్యంలో జరిగాయి. అలాగే ఆలయంలో భక్తులకు అన్నదానానికి సహకరించిన దాతలు రావూరి బాలాజీ సంధ్య, రావూరి మేధాన్స్‌ను అధికారులు, పాలక మండలి సభ్యులు సన్మానించారు.

ఘనంగా మాస శివరాత్రి పూజలు



ప్రత్యేక అలంకరణలో భుజంగేశ్వరుడు



విశేష పూజలందుకున్న అమ్మవారు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని శ్రీభుజంగేశ్వర స్వామి దేవస్థానంలో మాసశివరాత్రి పురస్కరించుకొని చైర్మన్ పోకల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, హారతులు నిర్వహించారు. రాఘవరాజపురంలోని భ్రమరాంభికా మల్లికార్జున స్వాముల వార్లకు చైర్మన్ యర్రంరెడ్డి రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పథకాల అమలులో పారదర్శకత

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి



సంక్షేమ బావుటాను అందిస్తున్న ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, ఎంపీపీ తదితరులు

వీరబల్లి : పారదర్శకతతో పథకాలు అమలు చేస్తున్న కారణంగా గడప గడపకు కార్యక్రమానికి అపూర్వ ఆదరణ లభిస్తోందని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిలు అన్నారు. శుక్రవారం మండలంలోని గుర్రప్పగారిపల్లి గ్రామ సచివాలయ పరిధిలో గడప గడపకు కార్యక్రమంలో మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతి గడపకు తిరిగారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు బుక్‌లెట్ అందిస్తూ వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడా, జడ్పీ చైర్మన్ ఆకేపాటిలు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి సచివాలయాలు ఉపయోగపడుతున్నాయి తెలిపారు. గతంలో పదుల సార్లు మండల కార్యాలయాల చుట్టూ తిరిగిన సమస్య పరిష్కారమయ్యేది కాదన్నారు. నాడు– నేడుతో పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయన్నారు. పేదలకు నాణ్యమైన విద్య అందాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉందన్నారు. అంతకు ముందు గ్రామస్తులు నాయకులకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, సీనియర్ నాయకుడు వీరనాగిరెడ్డి, జెడ్పీటీసీ శివరాం గౌడ్, వీఆర్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మహేశ్వరరాజు, సర్పంచ్ లక్ష్మీదేవి, సత్యనారాయణ రెడ్డి, శ్రీరాముల రెడ్డి, మునిరాజు, సుబ్బరామరాజు, వెంకట్రామిరెడ్డి, కసిరెడ్డి లక్ష్మీరెడ్డి, చలపతి నాయుడు, మదన్ మోహన్ నాయుడు, కుళాయిరెడ్డి, సానిపాయి సర్పంచ్ నేతి ఆంజనేయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గుర్రప్పగారిపల్లి గ్రామం కురవపల్లెలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఆర్బీకే సిబ్బంది రైతులకు అవసరమైన సేవలతోపాటు అధిక దిగుబడి పొందేందుకు రైతులకు సలహాలివ్వాలన్నారు.

దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ శివకుమార్

సిద్దవటం : దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల పట్ల విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించినట్లు మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్ తెలిపారు. శుక్రవారం మాధవరం–1 గ్రామ పంచాయతీలోని ఎస్‌కేఆర్ నగర్‌లో ఉన్న జీవీఎస్ స్కూల్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా డా.శివకుమార్ మాట్లాడుతూ కాలువలు, నీరు నిల్వ ఉన్న, పిచ్చిమొక్కలున్న ప్రాంతాల్లో దోమల వృద్ధి చెందుతాయన్నారు. దోమల ద్వారా మలేరియాతో పాటు బోధకాలు వంటి వ్యాధులు వస్తాయన్నారు. నివాస గృహాల్లో పరిసర ప్రాంత్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇండ్లల్లో తాగి పడేసిన కొబ్బరి బోండాలలో, పూలకుండీలలో, పాత టైర్లలో, పాత నీటి తొట్లలో నిల్వ ఉన్న నీరును తొలగించాలన్నారు. ప్రతి ఒక్కరూ దోమతెరలను వాటాలని ఆయన అన్నారు.

22న 'తనేగా ప్రాణం' పుస్తకావిష్కరణ

మదనపల్లె సిటీ : స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని జ్ఞానోదయ పాఠశాలలో ఆదివారం ప్రజా చైతన్య స్రవంతి ఆధ్వర్యంలో యువ రచయిత మంజుప్రీతం రచించిన ×తనేగా ప్రాణం పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి నాగభూషణ రావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రముఖ రచయితలు హాజరుకానున్నట్లు తెలిపారు. అలాగే లయన్ క్లబ్ అధ్యక్షుడు అప్పినపల్లి భాస్కరాచారి, ప్రజాస్రవంతి సంస్థ అధ్యక్షులు గొల్లపూడి తిరుపతిరావులకు సన్మానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రయివేటు ఆసుపత్రుల దోపిడిని అరికట్టాలి



మాట్లాడుతున్న శ్రీనివాసులు

రాయచోటి అర్బన్ : జిల్లా కేంద్రంలో సాగుతున్న ప్రయివేటు ఆసుపత్రుల దోపిడిని అధికారులు అరికట్టాలని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ళ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిన్న పాటి జ్వరం, దగ్గు వస్తే ప్రాథమికంగా వైద్యమందించాల్సిన వైద్యులు రోగులను వివిధ రకాల టెస్టుల పేరుతో దోచుకుంటున్నారంటూ ఆరోపించారు. చిన్న చిన్న రోగాలకు సైతం వారం, పది రోజులకు సరిపడే మందులు రాస్తూ రోగుల జేబులు ఖాళీ చేయిస్తున్నారన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో లేకపోవడం వలననే ప్రయివేటు ఆసుపత్రులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలియకజేశారు. ఇప్పటికైనా అధికారులు కఠిన చర్యలు తీసుకుని ప్రయివేటు వైద్యుల దోపిడిని అరికట్టాలంటూ ఆయన విజ్ఞప్తి చేశారు. సీపీఐ రాయచోటి సహాయ కార్యదర్శి జక్కుల వెంకటేష్, సీనియర్‌నేత వెంకటేశు, పట్టణ కార్యదర్శి వై.పుల్లయ్య, ఏఐ ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు లవకుమార్‌లు పాల్గొన్నారు.